



# కరపత్రం

SINCE 2014

సోమవారం డిసెంబర్ 23 2024 | సంపుటి :0 | సంచిక : 75 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం



కువైట్ సిటీ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం లభించింది. 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'ను మోడీకి ఆదివారం కువైట్ ప్రభుత్వం బహుకరించింది. కువైట్ చక్రవర్తి షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబెర్ అల్-సబాహ్ ఆహ్వానం మేరకు కువైట్‌లో రెండు రోజుల పాటు పర్యటించిన మోడీకి

## అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర: బండి సంజయ్



హైదరాబాద్: సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతిని అందరూ ఖండించారన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు. మృతురాలి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారన్నారు. ఈ సమస్య ముగిశాక అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించారని.. సినిమా తరహా కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించారని బండి సంజయ్ ఆరోపించారు.

"ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేశారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గతంలో భారాసను ఎంఐఎం నిండా ముంచింది. ఎంఐఎంను నమ్మితే కాంగ్రెస్‌కూ భారాస గతే పడుతుంది. కలుషిత ఆహారం తిని గురుకుల విద్యార్థులు చనిపోతున్నారు. వారి కుటుంబాలను సీఎం ఏనాడైనా పరామర్శించారా?ఆ మరణాలకు మీరు బాధ్యత వహించారా?మీకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి"అని బండి సంజయ్ అన్నారు.

# సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులను ఖండిస్తున్నా





హైదరాబాద్: సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు చేయడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ తరహా ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించానన్నారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధంలేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు.

## సినిమా చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు: చిక్కడపల్లి ఏసీపీ



సంధ్య థియేటర్ వద్ద డిసెంబరు 4న రాత్రి ఏం జరిగిందే విషయాన్ని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మీడియాకు వివరించారు.

2లో

## దేశ ఇంధన వనరులను తీర్చడంలో సింగరేణి కీలక పాత్ర : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




2లో

## కరెంట్ ఖాతాల ద్వారానే ఎక్కువగా సైబర్ నేరాలు

- సైబర్ నేరాల వల్ల ఈ ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.297 కోట్లు పోగొట్టుకున్నారని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.
- పరువు పోతుందనే ఉద్దేశంతో చాలా మంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావట్లేదని తెలిపారు.
- హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.




డయల్ 100కి వస్తున్న ఫిర్యాదులపై స్పందన పెరిగిందన్నారు. ఫిర్యాదులు అందిన తర్వాత ఘటనాస్థలికి వెళ్తున్న సమయం బాగా తగ్గిందన్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ కూడా పెంచామన్నారు. సౌండ్ పొల్యూషన్‌పై తాము తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు వస్తోందని చెప్పారు. డీజేల సౌండ్‌పై అప్పుడప్పుడు ఇంకా కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 45 శాతం ఎఫ్ఐఆర్‌లు పెరిగినట్లు వివరించారు."పెరిగిన ఫిర్యాదుల్లో చిన్నచిన్న చోరీలు, యాక్సిడెంట్ కేసులు ఉన్నాయి. గతంలో చిన్న ఫిర్యాదులకు ఎఫ్ఐఆర్ నమోదు జరగకపోయేది. ఇప్పుడు ప్రతి చిన్న నేరానికి కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంవల్ల కేసుల సంఖ్య పెరిగింది. కిడ్నాప్ కేసుల్లో 85 శాతం పెరుగుదల నమోదైంది. మొబైల్ చోరీల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సైబర్ నేరాల వల్ల



2లో

## సరదాగా కాసేపు.. రెస్టరంట్‌లో 'గాంధీ' కుటుంబం

- అధికారిక కార్యక్రమాలు పక్కనపెట్టిన గాంధీ కుటుంబీకులు ఓ రెస్టరంట్‌లో ప్రత్యక్షమయ్యారు.



## కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టి నిలదీయండి.. అన్నదాతలకు కేటీఆర్ బహిరంగ లేఖ



2లో

## సీఎంకు అల్లు అర్జున్ క్షమాపణ చెప్పాలి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి సినీనటుడు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన ఇమేజ్ దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడటం సరికాదన్నారు. శనివారం అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై కోమటి రెడ్డి స్పందించారు " ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదనటం హాస్యాస్పదం. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారు. ఇక నుంచి బెనిఫిట్ షోలు ఉండవు" అని ఆయన తెలిపారు.

## సంపాదకీయం

# చైర్ కాదు ఫైర్

తెలంగాణ రాజకీయాలలో వేడి పుట్టింది. ఏడాది క్రితం వరకు తెలంగాణలో తిరుగులేని అధికార కేంద్రంగా వెలుగొందిన మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఏ%–1గా పేర్కొంటూ అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. అందరిలాగే తండ్రి కేసీఆర్ మాటలు నమ్మి రేపో మాపో ముఖ్యమంత్రి కూడా అవుతానని కొంతకాలం పాటు ఊహల పల్లకిలో విహరించిన కేటీఆర్‌కు, రేపో మాపో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. ఫార్ములా%–ఈ రేసు కేసులో ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా పావులు కదిపింది. ఫార్ములా–ఈ రేసు వ్యవహారం కేటీఆర్ మెడకు చుట్టుకోబోతున్నదని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నందున తెలంగాణ సమాజం కూడా దీన్నో సంచలనంగా పరిగణించడం లేదు. అయితే భారత రాష్ట్ర సమితి నాయకులు, శ్రేణులు మాత్రం తమ అధినేతలను జైలుకు పంపితే తమ నెత్తిన పాలు పోసినట్టేనని ఆంతరంగిక సంభాషణల్లో సంబరపడిపోతున్నారు. అందుకే జైలుకు వెళ్లి వచ్చిన వాళ్లు ముఖ్యమంత్రి అవుతారని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు చెప్పుకొంటున్నారు. అలా అయితే ముందుగా కవిత ముఖ్యమంత్రి అవుతారని కాంగ్రెస్ నాయకులు కౌంటర్‌గా ఎగతాళి చేస్తున్నారు. నిజానికి జైలుకు వెళ్లి వచ్చినంత మాత్రాన ఎవరూ అమాంతం ముఖ్యమంత్రి అయిపోరు. అలా అయితే అవినీతి కేసులలో అరెస్టయ్యి జైలుకు వెళ్లడానికి చాలా మంది క్యూ కడతారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లి రావడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం ఉంది. తన ఒక్కగానొక్క బిడ్డ పెళ్లిని కూడా దగ్గరుండి సంతోషంగా జరిపించుకొనే అవకాశం లేకుండా కేసీఆర్ అండ్ కో చేసినందున రేవంత్‌రెడ్డిలో కసి పెరిగింది. ఈ కారణంగానే ఆయన తెలుగుదేశం పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరి చాలా వేగంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. ఆనాటి నుంచి ఎన్నికల వరకు కేసీఆర్‌పై అలుపెరుగని పోరాటం చేసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరానికి చేర్చారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించడం కూడా రేవంత్‌రెడ్డికి కలిసివచ్చింది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియంతృత్వ పోకడలతో ప్రజలకు దూరం అవడం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రధాన కారణం అయింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అధికార మార్పిడి జరిగిన నాటి నుంచే పోరాటాన్ని ఉధృతం చేసింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి తగిన సమయం ఇవ్వకుండా ఆందోళనలు చేయడాన్ని ప్రజలు కూడా హర్షించడం లేదు. అయితే ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా కల్వకుంట్ల కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య ఏర్పడిన వ్యక్తిగత వైషమ్యాలు తార స్థాయికి చేరాయి. ఈ ఏడాది కాలంలో ఒకటి రెండు సందర్భాలలో దుందుడుకుగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తనను నిత్యం దుర్భాషలాడుతున్న కేటీఆర్ విషయంలో మాత్రం పకడ్బందీగా పావులు కదిపారు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించి ఆయన నుంచి ముందస్తు అనుమతి పొందారు. సాంకేతిక కారణాలపై కేటీఆర్‌కు వెంటనే బెయిల్ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఒక దురదృష్టకర సంఘటనలో ఓ మహిళ మృతి చెందిన కేసులో ఆ సినిమా హీరో అల్లు అర్జున్‌ను అనూహ్యంగా అరెస్టు చేయించడం, ఇప్పుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్‌పై కేసు పెట్టించడం ద్వారా తాను ఏమిటో చెప్పకనే చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఈ రెండు చర్యల వల్ల రాజకీయంగా లాభమా? నష్టమా? అన్నది ఇప్పటికిప్పుడు తేలే అంశం కాదు గానీ 'సీఎం అంటే కేవలం కుర్చీ కాదు.. ఫైర్' అని రేవంత్‌రెడ్డి రుజువు చేస్తున్నారు. అంతే కాదు, పార్టీపైన, ప్రభుత్వంపైన తనకు పట్టు ఉందని కూడా రుజువు చేసుకున్నారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం చిత్ర పరిశ్రమలోనే కాదు ఎలీట్ సొసైటీలో ప్రకంపనలు సృష్టించింది. మహిళ మృతికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారణం కాకపోయినప్పటికీ, అంటే కుట్రపూరిత ఉద్దేశంతో వ్యవహరించనప్పటికీ కేసులో చిక్కుకున్నారు. దీంతో అల్లు అర్జున్ అరెస్టుకు మహిళ మృతి మాత్రమే కారణమా? లేక మరేదన్నా కారణం ఉందా? అని ప్రజలు ఆరా తీయడం మొదలుపెట్టారు. పుష్ప–2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోయారు. ఏడాదిగా ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పేరును హైదరాబాద్‌లో నివసిస్తున్న అల్లు అర్జున్ మర్చిపోవడాన్ని నెటిజన్లు సైతం హర్షించలేదు. అంతే, సినిమా హీరో అయితే ఏమిటి గొప్ప? ప్రజల్లో నేనే నిజమైన స్టార్‌ని! అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్లు సినిమావాళ్ల జోలికి వెళ్లేవారు కాదు. ముఖ్యంగా హీరోలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందని చెప్పి అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను ఉన్నపళంగా కూల్చివేయించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి ఒక రాత్రి జైల్లో గడపాల్సిన పరిస్థితి కల్పించారు. దీంతో చిత్ర పరిశ్రమ వెన్నులో వణుకు పుట్టింది. చంద్రబాబు, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులు అయినప్పుడు సినీ ప్రముఖులు స్వయంగా వెళ్లి వారిని అభినందించేవారు. జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి విషయంలో ఇది వెంటనే జరగలేదు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పేరును సినిమా వాళ్లు గుర్తుంచుకోకపోవడాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయి ఉండవచ్చు. ఎన్నికల ముందు వరకు సినీ ప్రముఖులు పలువురు అప్పటి మంత్రి కేటీఆర్‌తో రాసుకు పూసుకు తిరిగేవారు. అల్లు అర్జున్ ఎపిసోడ్‌తో సినిమా వాళ్లకు గట్టి సందేశం పంపిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కేటీఆర్ పని పట్టాలని నిశ్చయించుకున్నట్టుగా ఉంది. రాజకీయాలలో ఉన్నవారు పార్టీలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను వదులుకొనేవారు కారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం మొత్తం రేవంత్‌రెడ్డిని ఈసడించుకొనేవారు. రేవంత్‌రెడ్డి కూడా ఎక్కడా తగ్గకుండా తన నోటికి పని చెప్పేవారు. దీంతో ఇరు పక్షాల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి.

## కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టి నిలదీయండి..

# అన్నదాతలకు కేటీఆర్ బహిరంగ లేఖ

అన్నదాతలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది అని తెలిపారు. ఇప్పుడు మేల్కొకపోతే భరోసా ఉండదు.. గోస మాత్రమే మిగులుతుందని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని.. రైతు భరోసా ఎగవేతల మోసాన్ని ఎదురించాలని సూచించారు. ఆంక్షలు.. కోతలతో సగం మందికి ఎగనామం పెట్టే ఎత్తులను చిత్తుచేయాలని సూచించారు. ప్రతి ఎకరాకు.. ప్రతి రైతుకు పెట్టుబడి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎత్తులను, నక్క జిత్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి నిలదీయాలన్నారు.రైతులకు కేటీఆర్ రాసిన బహిరంగ లేఖ యథాతథంగా..తెలంగాణ రైతన్నలకు వందనం..!

నిన్న శాసనసభలో రైతు భరోసా మీద జరిగిన చర్చను మీరు చూసే వుంటారు! రైతు భరోసా పైనా ఏమీ చెప్పకుండా.. ఎటూ తేల్చకుండా సంబంధంలేని అంశాలపైకి చర్చను మళ్లించి అసలు సంగతిని అతి తెలివితో పక్కదారి పట్టించాడు ముఖ్యమంత్రి! బాగా అలవాటైన అటెన్షన్ డైవర్షన్ జిమ్మిక్కులను ప్రదర్శించాడు! రైతు భరోసా పథకంపైన ఆంక్షలు.. అనుమానాలు.. సందేహాలు వేటికి సమాధానం చెప్పకుండా దాట వేసింది ప్రభుత్వం!

అంతేకాదు.. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుబంధు పథకంపై పచ్చి అబద్ధాలతో కూడిన దుష్ప్రచారాన్ని, దాడిని చేశారు! అన్నంపెట్టే రైతును దొంగలా చిత్రించే దుర్మార్గానికి ఒడిగట్టారు! కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వరుస చూస్తే.. కోతలు కొర్రీలు పెట్టి రైతు భరోసాను సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ఉన్నట్టు అర్థమైంది..! తిండి పెట్టే రైతుకు తొండి చేసి పైసలు ఎగ్గొట్టే పన్నాగం ప్రారంభమైంది! విధివిధానాలు.. మార్గదర్శకాలు ఏమీ సభలో చెప్పకుండా సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తాం అని ఒక మాట చెప్పి తప్పించుకుంది సర్కారు! రైతన్నలారా రైతుబంధును బొంద పెట్టి పనికిమాలిన షరతులు విధించి అరకొరగా రైతు భరోసా అమలు చేసి మిమ్ముల్ని నిండాముంచే ఒక పెద్ద దోఖా జరగబోతున్నది! అప్రమత్తంగా వుండాల్సిన సమయం ఇది..! మోసపోకుండా జాగ్రత్తగా వుండాల్సిన సందర్భం ఇది! స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని దాటడం కోసం..ఏవో మాయోపాయాలు చేసి మమ అనిపించి పెట్టుబడి సాయానికి పూర్తిగా ఘోరీ కట్టే ఘోరాలు చేయబోతున్నారు!అన్నదాతలారా తస్మాత్ జాగ్రత్త! వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది..! ఇప్పుడు మేల్కొకపోతే భరోసా వుండదు ..గోస మాత్రమే మిగులుతుంది!

ఉమ్మడి రాష్ట్రంలో సాగు సంక్షోభం లో మునిగి.. వెన్ను విరిగిన తెలంగాణ అన్నదాతను ఆదుకోవడానికి కేసీఆర్ గారి నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక పాలసీలను పథకాలను ప్రవేశపెట్టింది.! తెర్లైన రైతు తేరుకున్నడు.. ఆగమైన ఎవుసం బాగుపడ్డది! ముఖ్యంగా.. రైతుకు రంధి లేకుండా రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చడంలో కీలక పాత్ర పోషించింది! రైతు ఎవరి ముందూ పెట్టుబడి కోసం చేయి చాచే దుస్థితి లేకుండా వానాకాలం.. యాసంగి రెండు పంటలకు అవసరమైన పైసలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో పడే ఒక అపురూపమైన ఆలోచన ఆచరణే రైతుబంధు! కుప్పకూలిన వ్యవసాయాన్ని నిలబెట్టాలన్న సంకల్పంతో తేడా చూప కుండా ప్రతి రైతుకూ పెట్టుబడి పైసలు ఇవ్వాలని నిర్ణయించాం! మొత్తం 11 సీజన్లలో 73 వేల కోట్ల రూపాయలను కర్షకుల ఖాతాల్లో జమ చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం! అవినీతికి.. లీకేజీలకు తావులేని అతిపెద్ద నగదు బదిలీ పథకం రైతుబంధు! యావత్ ప్రపంచం మెచ్చింది..దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి! అంతేకాదు%‰% మరో 28వేల కోట్లు రుణమాఫీ కింద నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్లలో పడ్డాయి! ఈ రెండు స్కీమ్ ల ద్వారానే అక్షరాలా లక్షకోట్ల రూపాయలు అన్నదాతల ఖాతాల్లో డైరెక్ట్ గా జమయ్యాయి! దుక్కి దున్నేవాడి దుఖం తీర్చాలన్న లక్ష్యంలో రైతన్న మీద ప్రేమతో ఈ బృహత్ కార్యక్రమాన్ని అమలు చేసాం! ప్రతి పైసాను సద్వినియోగం చేసుకొని..పుట్లకొద్ది పంటలు పండించి లక్షల కోట్ల సంపద సృష్టించారు మీరు! 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్లైనా అధికారంలోకి రావాలని అన్ని వర్గాలతో పాటు రైతాంగానికి కూడా కాంగ్రెస్ పార్టీ ఇష్టమొచ్చిన హామీలను గుప్పించింది! కేసీఆర్ ఎకరానికి 10వేలే ఇస్తున్నడు.. మేం పవర్ లోకి వస్తే 15 వేలు ఇస్తామని వాగ్దానం చేసారు! రైతుభరోసా కింద ప్రతి ఎకరానికి ఏడాదికి 15వేలు ఇస్తామని పార్టీ మేనిఫెస్టోలో చెప్పారు! గద్దెనెక్కిన వంద రోజుల్లో తప్పకుండా అమలు చేసి చూపిస్తామని గ్యారెంటీ కార్డులు ఇంటింటికి తిరిగి పంచారు! కాంగ్రెస్ పార్టీ గెలిచి.. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కాలం గడిచిపోయింది! ఇంతవరకూ రైతు భరోసా జాడా పత్తా లేదు! పదిహేను వేలు ఇయ్యలేదు సరికదా వున్న పదివేలను ఊడగొట్టారు! ఇప్పటికే రెండు పంట సీజన్లు అయిపోయాయి.. మూడో సీజన్ కూడా వచ్చేసింది! ఈ వానాకాలం పూర్తిగా ఎగ్గొట్టారు! నిన్న యాసంగి రూ.2500 కోత వేసారు! ఇప్పటి యాసంగి ఇస్తారో లేదో తెలియదు! మొత్తంగా ఒక్కో రైతుకు ఒక్కో ఎకరానికి 17,500 రూపాయలను బాకీ పడ్డది రేవంత్ రెడ్డి సర్కారు! అన్నదాతల ఖాతాల్లో పడాల్సిన పైసలు ఇవి! రైతులకు హక్కుగా రావాల్సిన సొమ్ము ఇది! వదులుకోవద్దు! అందుకే ప్రతి రైతు ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి! ఈ సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తామని చెబుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం! అందరి రైతులకు ఇస్తారా లేదా అని శాసన సభలో ప్రశ్నిస్తే సప్పుడు లేదు సమాధానం లేదు! పైగా రాళ్లు రప్పలకు ఇచ్చి రైతుబంధు ఇచ్చి దుర్వినియోగం చేసారని అడ్డగోలు గా వాదించారు కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు! సర్కారు వైఖరిని గమనిస్తే అర్థంలేని కొర్రీలు .. కోతలు పెట్టి అరకొరగా అమలు చేసి రైతు భరోసా ఇచ్చేసినం అని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నట్లు స్పష్టంగా అర్థమైతున్నది! అసలు..కొత్తగా ఈ సంక్రాంతి తరువాత రైతు భరోసా వేసే రాగం ఎందుకు అందుకున్నారు? ఇప్పుడు వేసేది వానాకాలం పైసలా? యాసంగి పైసలా? ఏడాదికి ఒకే పంటకు ఇస్తారా.? రెండు పంటలకు వేస్తారా? ఈ కుట్రను కూడా రైతాంగం గుర్తించాలి! ఇప్పుడు వేయాల్సింది ఎకరానికి రూ,7500 కాదు..రూ.17500 అని అన్నదాతలు గట్టిగా అడిగితీరాలి! రైతు భరోసా విధి విధానాలు నిర్ణయిస్తామని కేబినెట్ సబ్ కమిటీ వేసి కాలయాపన చేసారు! జిల్లాల్లో సదస్సులు పెట్టి అభిప్రాయ సేకరణ అంటూ ఇంకొంత కాలం సాగదీసారు! ఎన్నికల ముందు ఎవరి అభిప్రాయాలు తీసుకొని ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి 15వేలు ఇస్తామన్నారు..? ఇప్పుడెందుకు ఈ నాటకాలు! ఎన్నికలు ఏరుదాటగానే తెప్ప తగలేస్తున్నారా? గత ఏడాది కాలంగా లీకులు ఇస్తూ ఇన్ కం టాక్స్ కట్టేవాళ్లకు పాన్ కార్డు వున్న వాళ్లకు రైతుబంధు కట్ అని పత్రికల్లో కథనాలు రాయించారు! లక్షలాది మంది ఉద్యోగులకు ఇక భూమితో బంధం తెంపేస్తారా? బ్యాంకు లోన్లు సులభంగా రావడం కోసం ఐటీ చెల్లించి.. పాన్ కార్డు తీసుకున్న వాళ్లందరి నోట్లో మన్నుకొడతారా?

# మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి

ఇది ఒక దేశం నుంచి వచ్చిన 20వ అంతర్జాతీయ పురస్కారం. 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్' అనేది కువైట్ ప్రభుత్వ పురస్కారం. ఇతర దేశాలతో స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలు, విదేశీ సార్వభౌమాధికారులు, విదేశీ రాజ కుటుంబాల సభ్యులకు ఈ పురస్కారాన్ని కువైట్ అందజేస్తుంది. గతంలో బిల్ క్లింటన్, ప్రిన్స్ చార్లెస్, జార్జ్‌బుష్ వంటి విదేశీ నాయకులకు బహుకరించింది.

కువైట్ చక్రవర్తితో మోడీ చర్చలు

కువైట్ చక్రవర్తి షేక్ మెషల్ అల్‌అహ్మద్ అల్‌జబెర్ అల్‌సబ్బాతో ప్రధానమంత్రి మోడీ ఆదివారం విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఫిన్‌టెక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రక్షణ రంగాల్లో ఈ చర్చలు సాగాయి. ఈ విషయాన్ని మోడీ ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించారు. చర్చలు అద్భుతమని వర్ణించారు. 'ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు అనుగుణంగా, మా భాగస్వామ్యాన్ని వ్యూహాత్మకంగా పెంచాం. అలాగే రాబోయే కాలంలో మా స్నేహం మరింత అభివృద్ధి చెందుతుందని నేను ఆశాభావంతో ఉన్నాను' అని కూడా మోడీ ఎక్స్ పోస్టులో తెలిపారు. అలాగే, మోడీ, చక్రవర్తి మధ్య చర్చలు ఇరు దేశాల సంబంధాలను 'నూతన శిఖరాలకు' తీసుకుళ్లే మార్గాలను అన్వేషించడంపై దృష్టి సారించాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

కువైట్ ప్రధానమంత్రి క్రౌన్ ప్రిన్స్ షేక్ సబా అల్ ఖలీద్ అల్ సబాతో కూడా మోడీ సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన కోసం శనివారం కువైట్‌కు మోడీ చేరుకున్నారు. 43 ఏళ్ల తరువాత కువైట్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చివరిగా కువైట్‌లో పర్యటించారు. భారతదేశపు ప్రముఖ వాణిజ్య భాస్వాముల్లో కువైట్ ఒకటి. 2023–24లో ఇరు దేశాల మధ్య 10.47 బిలియన్ డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. అలాగే కువైట్ భారత్ యొక్క ఆరో అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు, దేశపు ఇంధన అవసరాల్లో మూడు శాతాన్ని కువైట్ తీరుస్తుంది.

# సరదాగా కాసేపు.. రెస్టరంట్‌లో 'గాంధీ' కుటుంబం

మొదటి పేజీ తరువాయి



ఎన్నికల ప్రచారం, పార్లమెంటు సమావేశాలు వంటి వరుస కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపిన సోనియా గాంధీ కుటుంబం.. ప్రస్తుతం కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్లు కనిపించింది.

అధికారిక కార్యక్రమాలు పక్కనపెట్టి ఓ రెస్టరంట్‌లో ప్రత్యక్షమైంది. సోనియా, రాహుల్, ప్రియాంక–రాబర్ట్ వాద్రా దంపతులతో పాటు వారి కూతురు మిరాయాలు దిల్లీలో ఉన్న క్వాలిటీ రెస్టరంట్‌కు వెళ్లారు. కుటుంబంతో కలిసి భోజనం చేశారు. "మీరు ఇక్కడకు వస్తే చోలే భటూరే ట్రై చేయండి" అంటూ ఫుడ్ ప్రియులకు రాహుల్ గాంధీ సూచించారు. వీటికి సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో రాహుల్ గాంధీ షేర్ చేశారు.

## కరెంట్ ఖాతాల ద్వారానే ఎక్కువగా సైబర్ నేరాలు

మొదటి పేజీ తరువాయి

డిజిటల్ అరెస్టు అనగానే భయపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పెట్టుబడుల విషయంలోనూ మోసపోతున్నవారు అధిక సంఖ్యలో ఉన్నారు. గతేడాది కంటే 91 శాతం ఎక్కువ డబ్బు పోగొట్టుకున్నారు. కరెంట్ ఖాతాల ద్వారా సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఎటువంటి విచారణ లేకుండానే కొందరికి బ్యాంక్ సిబ్బంది కరెంట్ ఖాతాలు ఇస్తున్నారు. కొందరు బ్యాంక్ సిబ్బంది కూడా సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నారు" అని సీపీ ఆనంద్ వివరించారు.

## సినిమా చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు: చిక్కడపల్లి ఏసీపీ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద డిసెంబరు 4న రాత్రి ఏం జరిగిందే విషయాన్ని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మీడియాకు వివరించారు. "అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ని కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయారు, బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి అదుపుతప్పింది. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించాం. అయినా.. మేనేజర్ మమ్మల్ని అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదు. అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి జరిగిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పా. మీకు అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారు. దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అని చెప్పా. సినిమా చూసిన తర్వాతే వెళ్తానని చెప్పారు. వెంటనే డీసీపీకి చెప్పాం. ఆయన.. మేము లోపలికి వచ్చి 10 నిమిషాలు సమయం ఇచ్చాం. ఆ తర్వాత అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చాం. మేం లోపలికి వెళ్లే వీడియోలు ఉన్నాయి. అల్లు అర్జున్‌తో మాట్లాడే ఫుటేజ్ కోసం ట్రై చేశాం దొరకలేదు" అని చిక్కడపల్లి ఏసీపీ మీడియాకు వివరించారు.

"అల్లు అర్జున్ వద్దకు మేము వెళ్లేందుకు మేనేజర్ ఒప్పుకోలేదు. అక్కడి నుంచి అల్లు అర్జున్ వెళ్లకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని చెప్పాం" అని చిక్కడపల్లి ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్తాం: సీపీ

సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొన సాగుతోందని, న్యాయ పరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధాన మిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. బౌన్సర్లు ఇకపై పోలీసులను ముట్టుకున్నా, మిస్ బిహేవ్ చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీపీ హెచ్చరించారు. దీనిపై పూర్తి బాధ్యత సప్లై ఏజెన్సీలదేనన్నారు. ప్రజలకు ఇబ్బంది గురించి ఆలోచించే బాధ్యత కూడా వీఐపీలదే అని స్పష్టం చేశారు.

## దేశ ఇంధన వనరులను తీర్చడంలో సింగరేణి కీలక పాత్ర : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మొదటి పేజీ తరువాయి

పెద్దపల్లి : దేశంలో ఇంధన వనరులను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులకు,సిబ్బంది, అధికారులకు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తుందని పేర్కొన్నారు.తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాలలోకి కూడా ప్రవేశించి, మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్మికులు శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని కోరారు.

# సిఎం ను కలిసిన ఎంపీ ఎమ్మెల్యే

## నవోదయ పాఠశాలకు భూములు కేటాయించండి

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి

- నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయాల ఏర్పాటుకు స్థలాలు అందజేయండి
- ఆర్ఓబి నిర్మాణాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి
- జక్రాన్ పల్లి ఎయిర్పోర్ట్ ఓఎల్ఎస్ సర్వే చేసి కేంద్రానికి నివేదించండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన ఎంపీ అర్వింద్
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



ఇటీవల ప్రధాని మోడీ నాయకత్వంలోని కేంద్ర కేబినెట్, జగిత్యాల మరియు నిజామాబాద్ జిల్లాలో నవోదయల ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయమై నిజామాబాద్ ఎంపీ అరవింద్, జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ తోడుగా నిన్న ఆదివారం జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు.ఈ రెండు జిల్లాల్లో నవోదయ పాఠశాలల ఏర్పాటుకు ఒక్కోచోట సుమారు 20 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను ఎంపీ, సీఎంకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరిస్తూ, మాధవ్ నగర్ ఆర్ఓబి 50-50 పద్ధతిలో మంజూరు చేయబడిందని, అడివి మామిడిపల్లి ఆర్ఓబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైనప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను మళ్ళించిందన్నారు.కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఇవేగాకుండా ఇతర ఆర్వోబీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని, కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి , పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్ పల్లి ఎయిర్పోర్ట్ పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వే ని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రానికి నివేదించాలని కోరారు. మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని సీఎంని కోరారు.జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ఎంపీ అర్వింద్ తో కలిసి జగిత్యాల పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాల పై ముఖ్యమంత్రితో చర్చించారు. తమ విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించారని ఎంపీ అర్వింద్ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# అత్యంత వైభవంగా మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు...



కరపత్రం,బోధన్ డిసెంబర్22..



బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో శ్రీ పద్మావతి మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా,ఘనంగా నిర్వహించారు. ఆదివారం పద్మావతి మల్లన్న స్వామి వారి కల్యాణ మహోత్సవం పురస్కరించుకొని పెద్ద ఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా గ్రామంలో గుట్టపై గల స్వామి ఆలయానికి చేరుకున్నారు. అత్యంత భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు విశాఖపట్నం వాస్తవ్యులు కాసు మహాలక్ష్మీ-మల్లారెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఊట్ పల్లి గ్రామ ప్రజలు అన్నదాత దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ధంకా బిర్యానీయా? ధంకీ బిర్యానీయా?

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి




మేడ్చల్ జిల్లాలోని ఘట్ కేసర్ లో ఉన్న ఆదర్శ్ బార్ %ఌ% రెస్టారెంట్ లో వడ్డించిన ఓ బిర్యానీలో బ్లేడ్ కలకలం సృష్టించింది.బీబీనగర్ మండలం మక్త అనంతారం గ్రామానికి చెందిన బింగి ఐలయ్య, అతని ఫ్రెండ్స్ కి బిర్యానీ తింటుండగా ఈ బ్లేడు కనిపించినట్టు తెలుస్తుంది.ఇదే విషయంపై రెస్టారెంట్ యాజమాన్యాన్ని సంప్రదించగా.. అనుకోకుండా వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఐలయ్య ఆరోపిస్తున్నాడు. ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇంకో పక్క ఈ బిర్యానీలో బ్లేడ్ వీడియో వైరల్ గా మారింది.ఇది బిర్యానీలో వచ్చిన బ్లేడ్ కాదని, ఈ వ్యక్తులు తమతో తెచ్చుకున్న బ్లేడ్ బిర్యానీ ప్లేట్ లో పెట్టి గొడవ సృష్టించారని హోటల్ యాజమాన్యం అంటున్నది.ఈ మధ్యన ఫుడ్ సేఫ్టీ డిపార్ట్ మెంట్ అధికారులు అన్ని హోటల్స్ ను తనిఖీలు చేస్తున్నారు.శుభ్రత పాటించని హోటల్స్ ను, ఆహార కల్తీ చేస్తున్న హోటల్స్ ను సీజ్ చేస్తున్నది.చాలా హోటల్స్ కు జరిమానా కూడా విధిస్తున్నది.అయితే ఈ పరిణామాన్ని ఉపయోగించుకొని సందులో సడేమియా అన్నట్టు కొందరు వ్యక్తులు తమ పాత కక్షలు తీర్చుకుంటున్నారని కూడా అభిప్రాయాలు వినవస్తున్నాయి.ధంకా బిర్యానీ అడ్డం పెట్టుకొని, ఆకతాయి వ్యక్తులు హోటల్ యాజమాన్యాలకు ధంకీలు ఇస్తున్నారని కూడా జనాభిప్రాయం.ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే హోటల్స్ పై కఠిన చర్యలు తీసుకోవడం స్వాగతించాల్సిందే.అదే సమయంలో హోటల్ యాజమాన్యాలపై కావాలని రాద్ధాంతం చేసే వారిపై తగిన విచారణ చెయ్యాలని పోలీసులను హోటల్స్ యాజమాన్యాలు కోరుతున్నాయి.

# కలెక్టరేట్లో అధికారికంగా జి.వెంకటస్వామి వర్ధంతి




కరపత్రం నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 22 :

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సుడా చైర్మన్ కేశ వేణు, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు.ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి,వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు.స్వర్గీయ వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ,ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.వెంకటస్వామితో తనకు గల అనుబంధాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.వర్ధంతి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఔరంగజేబు బంధించలేని శివాజీని చిక్కుడు తీగ బంధించింది

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి
కోరుట్ల నియోజకవర్గం



ఛత్రపతి శివాజీ చరిత్ర తెలిసిన వాళ్ళకి ఆ వీర యోధుడు అంటే ఆరాధన.భారత జాతి సగర్వంగా చెప్పుకునే ఛత్రపతి శివాజీ పేరు వింటే చాలు ఉత్సాహం తో ప్రతి ఒక్కరి రక్తం ఉరకలెత్తి పారుతుంది.భారత దేశ చరిత్ర లోనే ఏ వీరునికి లేనన్ని విగ్రహాలు ఈ గొప్ప వీరుడికే ఉన్నాయి..అలాంటి గొప్ప వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఒకటి కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో బస్ స్టాప్ దగ్గర మెయిన్ రోడ్డులో ఉంది.అయితే ఆ ఊర్లో ఉన్న విగ్రహానికి చిక్కుడు తీగ చుట్టుకుని ఉంది అనే విషయం తెలియగానే.బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల రంజిత్, బిజెపి సీనియర్ నాయకులు గిన్నెల అశోక్ , దూలూరి శ్రీధర్, గౌటి రాహుల్, ఎడమపెల్లి సాయి, పిల్లి రాజశేఖర్, కంటం రమణ, మరిపెల్లి నవీన్ తో పాటు ఇంకొందరు కలిసి కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి వెళ్లి చిక్కుడు తీగ తో చుట్టుకుని ఉన్న విగ్రహాన్ని పరిశీలించి చిక్కుడు చిక్కుల్లో ఉన్నఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి విముక్తి కలిగించి విగ్రహానికి జలాభిషేకం చేసారు.ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ వీరి స్పందనకు,సేవకు కృతజ్ఞతలు తెలిపారు.వీరితో పాటు గ్రామ యువకులు ప్రజలు చలిని లెక్క చేయకుండా గుమిగూడి వీర శివాజీ కి జయ జయ ధ్వానాలు చేసారు.

# ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు...



కరపత్రం బోధన్ డిసెంబర్ 22..

బోధన్ పట్టణంలోని శ్రీ విజయ సాయి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత-దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ప్రహేళికా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బోధన్ మండల విద్యాధికారి నాగయ్య విచ్చేసి, శ్రీనివాస రామానుంజ గొప్పతనాన్ని నిజజీవితంలో గణిత ప్రాముఖ్యతను వివరించారు. గణితం బోధించిన ఉపాధ్యాయులను స్మరించుకున్నారు. గణితము ద్వార ఆలోచనా శక్తిని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. సృజనాత్మకతకు పదును పెట్టేది గణితమని తెలిపారు. నిర్వహించిన క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, పాఠశాల గణిత విభాగమునకు చెందిన ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన జాతీయ గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సఫాయి కార్మిక సమస్యల సమీక్ష

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి



మహిళా సఫాయి కర్మచారీల కోసం అంతరంగిక కమిటీలను ఏర్పాటు చేసి వారికి ఏమైన వేధింపులు, సమస్యలు ఉంటే వెంటనే కమిటీల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని శనివారం జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ వెంకటేసన్ తెలిపారు.మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సఫాయి కర్మచారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి హాజరైన జాతీయ సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ను సత్కరించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం డిసెంబర్ 23 2024

## హుజురాబాద్ నియోజకవర్గంలో పలు కుటుంబాలను పరామర్శించిన బల్మూరి వెంకట్..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట.. డిసెంబర్ 22**



హుజురాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్సీ వెంకట్.ఎమ్మెల్సీ బాలుమూరు వెంకట్ హుజురాబాద్ నియోజకవర్గం లో సుడిగాలి పర్యటన చేశారు.హుజురాబాద్ నియోజకవర్గం వర్గంలోని హుజూరాబాద్, కమలాపూర్ జమ్మికుంట,ఇల్లందకుంట,వీణవంక మండలాలు పర్యటించి ఇటీవల మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం పలు కార్యక్రమంలో పాల్గొన్నారు.జమ్మికుంట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజి సర్పంచ్ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య సోదరుడు బుచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ వెంకట్ పొనగంటి మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు వున్నారు.

## దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమం

**– మీ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ డిసెంబర్ 22.**






మీ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1338 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున లక్ష్మీగణపతి, రాజన్న మరియూ భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా కుమారుని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వస్తాద్ రాజేష్ సాహిత్య దంపతులు, జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు ఉన్నారని అన్నదాన కార్యక్రమానికి శాశ్వత సభ్యత్వం పొందాలి అనుకునే అన్నదాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్టు ఫోన్ నం 92469 39388 నంబరు ద్వారా సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, పొలాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకట్ స్వామి ( కాక) 10 వ వర్ధంతి

**–మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.**

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట డిసెంబర్ 22...**





పెద్దపల్లి మాజీ పార్లమెంటు సభ్యులు కాకా పేదలకు కార్మికులకు మెరుగైన జీవన సదుపాయాలను కల్పించడం కోసం విశేష కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రివర్యులు గడ్డం వెంకటస్వామి 10 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో కార్మికులకు వారి కుటుంబాలకు పెన్షన్స్ స్కీం అమలయ్యేలా చేసిన ఆధ్యుడు కాకా అని ,పేదల కోసం నిగ్గదీసి అడగడంలో నిజం మాట్లాడడంలో కాక వెనుకడు వేసిన రోజు లేదని ,అంబేద్కర్ ఆశయాల కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన మహనీయుడు అని, రాజకీయ భీష్ముడు కార్మిక బాంధవుడు అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడిశాల పరమేష్, పైడిపల్లి దేవేందర్,గుండ్ల వెంకన్న ,రాజేందర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి,గోలి కిరణ్ పెద్ది కుమార్ ,రాజబాబు, కొమురయ్య, రాజయ్య ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కమీషనరేట్ భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపీఎస్...

**కరపత్రం,శంకర పట్నం డిసెంబర్ 22**




కరీంనగర్ కొత్తపల్లి నందు తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కమీషనరేట్ కొరకు నూతనంగా, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన భరోసా కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపీఎస్ ఆదివారంనాడు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర డీజీపీ కి కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పూల మొక్కతో ఘన స్వాగతం పలికారు. అనంతరం భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నూతన భరోసా కేంద్ర నూతన భవనాన్ని ప్రారంభించారు. భరోసా కేంద్రంలో బాధిత మహిళలకు సేవలందించేందుకు గాను ఏర్పాటు చేయబడిన గదులు, వాటిలో వసతులు పరిశీలించారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ 1000 గజాల స్థలంలో, 6800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో చాల అద్భుతంగా నిర్మించారానన్నారు. కరీంనగర్ లోని భరోసా కేంద్రంలో సేవలు సోమవారం నుండి అందుబాటులోకి రానున్నాయన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, అసభ్యకరమైన లైంగిక ప్రవర్తనకు లోనైన పిల్లలకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించేందుకే తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కమీషనరేట్ మరియు జిల్లాల్లో ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితులకు సేవలందించుటలో భరోసా కేంద్రాల ఏర్పాటు మంచి సత్ఫలితాలనిస్తుందన్నారు. లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందన్నారు.హైదరాబాద్ లో మొదట ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 27 జిల్లాల్లో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ భరోసా కేంద్రంలలో బాధిత మహిళలకు మానసిక ప్రోత్సాహంతో పాటు, పోలీస్ సేవలు, అవసరమైన వైద్య సహాయం, న్యాయ సేవ, బాధితులకు సహాయ నిధి మొదలగు ఇతర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిటిజెన్ ఫీడ్ బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం వలన ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యంగా మహిళల భద్రతే భరోసా యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డి ఐ జి రమా రాజేశ్వరి, ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ , ఏసీపీ మాధవి , ఇన్స్పెక్టర్ శ్రీలత , ఎస్బిఐ బ్యాంకు అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**– కనీస వేతనం ,ఉద్యోగ భద్రత కల్పించాలి**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 22**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు. అంగిడి కుమార్ మాట్లాడుతూ....................**




రాష్ట్రంలో సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులు సమ్మె బాట పట్టారు లో పనిచేస్తున్న పది విభాగాలకు చెందిన ఉద్యోగులు న్యాయంగా వారికి రావలసిన సౌకర్యాల కోసం అనేక ఏండ్లుగా ఉద్యమాలు చేస్తూ నేడు సమ్మెలో ఉన్నారు. ఈ సమస్యను పరిష్కరించవలసిన ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తుంది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగుల ధర్నా టెంట్లు దగ్గరికి వచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆనాటి పీసీసీ అధ్యక్షులు హొదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు వివిధ వేదికల్లో బట్టి విక్రమార్క సహా అనేకమంది కాంగ్రెస్ పెద్దలు సైతం ఉద్యోగులకు హామీ ఇచ్చారు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగులకు సాధారణంగా ఉన్న సేవలను వీరు ఉపయోగించుకునే పరిస్థితి లేదు సాధారణ సెలవులు, ప్రసూతి సెలవులు కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇక పిఎఫ్, ఈఎస్ఐ లాంటి లేనే లేవు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, న్యాయబద్ధంగా రావలసిన రక్షణ పథకాలకు కూడా రావడం లేదు. పదేళ్లుగా ఈ సంస్థల అభివృద్ధిని కోసం పేద పిల్లల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఉద్యోగులు, వర్కర్స్ రెగ్యులరైజ్ చేసే ఉద్దేశమే ప్రభుత్వాలకి లేదు అనిపిస్తుంది. మణిపూర్, పంజాబ్, త్రిపుర, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ లో బేసిక్ పే చెల్లిస్తున్నారు. కానీ, తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనం కూడా దక్కడం లేదు వీరి సమస్యలు పరిష్కారం కావాలంటే (సర్వ శిక్ష అభియాన్) విద్యా శాఖలో విలీనం చేయాలని అందరిని రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం, బేసిక్ పే నిర్ణయించాలని, ఈఎస్ఐ పిఎఫ్ వైద్య తదితర సౌకర్యం కోసం ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము తక్షణమే ఎస్ ఎస్, ఏ ఉద్యోగుల సమస్యను పరిష్కరించి విద్యార్థులకు విద్యను దూరం చేయకుండా విద్యను అందించాలి ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు రామ్ చరణ్, నార్ల ఆకాష్, నార్ల శ్రీజస్, సన్నీ, విద్యార్థిని తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన ఆర్.కృష్ణయ్యను సన్మానించిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 22...**



తెలంగాణ రాష్ట్రం :, విద్యానగర్ బీసీ భవన్ ) రాజ్యసభ ఎంపీ గా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్. కృష్ణయ్యను ఈరోజు బీసీ భవన్ లో నూతన ఎంపీ కృష్ణయ్య ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... రాజ్యసభ సభ్యులుగా కృష్ణయ్య కి అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హొంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత 40 సంవత్సరాలుగా కృష్ణన్న బీసీలకు చేస్తున్న సేవలను గుర్తించి రాజ్యసభ సభ్యులుగా అవకాశం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నట్టు వెల్లడించారు. పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా ఉద్యమం నేడు కీలక దశకు చేరుకున్నదని వివరించారు. దేశ ప్రధాని మోడీ పార్లమెంట్లో బీసీ బిల్లుకు అనుకూలంగా ఉన్నారని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో బీసీలకు అందుతున్న సంక్షేమ పథకాలు యావత్ భారతదేశం మొత్తం అందేలాగా నరేంద్ర మోడీతో చర్చించి రూట్ మ్యాప్ ఖరారు చేయడంలో ఆర్ కృష్ణయ్య కీలక పాత్ర పోషించనున్నట్లు శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంటీ స్వరూపశ్యాం,బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల ఉమా మహేశ్వర బీసీ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి...

**– పార్లమెంట్ హడక్ కమిటీ సభ్యులు ప్రభాకర్...**

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 22**



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి జాతీయ నాయకత్వ సూచన మేరకు సభ్యత్వ కార్యక్రమం చేపట్టాలని తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ హడక్ కమిటీ సభ్యులు మోరే ప్రభాకర్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు దిశా నిర్దేశం చేశారని, జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశాలను పార్టీ నాయకులు కార్యకర్తలు తూచా తప్పకుండా పాటించి, జాతీయ నాయకత్వం ఆదేశం మేరకు పార్టీ సభ్యత్వాన్ని చేపట్టాలని కోరారు. శంకరపట్నం మండలంలో ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు అనేకంగా ఉన్నారని, ప్రతి కార్యకర్త అభిమానులు ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అభిమానులను ఎన్టీఆర్ అభిమానులను చంద్రబాబు అభిమానులను కలిసి సభ్యత్వాన్ని చేపట్టి , తెలంగాణలో పార్టీ పటిష్టతకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బైరి తిరుపతి, గోపి వీరమల్లు, కదిరే కొమురయ్య, కమలాకర్ రెడ్డి, మహేష్, సాగర్, తదితరులు ఉన్నారు.